

వారు నన్ను చంపవచ్చు కానీ, వారు నా ఆలోచనలు చంపలేరు. వారు నా శరీరాన్ని నలిపివేయవచ్చు. కానీ, నా ఆత్మను నలిపి వేయలేరు.

- భగత్ సింగ్

# జనస్వరం

అక్షరమే ఆయుధం ✍

www. Janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.



సంపుటి : 01 సంచిక : 03 ఎడిటర్ : నరేష్ సాకే వారసంచిక ( 26 -07-2020 ) పేజీలు : 6

janaswaramNEWS 9642067900





## జనసేనాని ఇంటర్వ్యూ

**ప్రభుత్వ విధివిధానాలపై, సమాజ ప్రశ్నలను లేవనెత్తుతూ సమగ్ర విశ్లేషణ**

న్యూస్ ( జనస్వరం ) : జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు చాలా రోజుల తర్వాత మన ముందుకు ఇంటర్వ్యూ రూపంలో వచ్చారు. ఈ ఇంటర్వ్యూ లో గత ప్రభుత్వం చేసిన తప్పులను, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలను తనదైన శైలిలో వివరించడం జరిగింది. ( వివరాలు 3 లో )

## ఓ మగువా నీకు రక్షణ ఎక్కడ ?



- మొదటి దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసిన ఏరియాలోనే ఆడపిల్లకు రక్షణ కరువు
- మన రాష్ట్రంలో దిశ కేసుకు అసలు దశ ఉందా ?
- చాలా చోట్ల ప్రభుత్వ గ్రామ వాలంటీర్లే అమ్మాయిల మీద అఘాయిత్యం
- దిశ చట్టంను నీరు గారుస్తున్న రాజకీయ, ప్రభుత్వ యంత్రాంగం

న్యూస్ ( జనస్వరం ) : మన రాష్ట్రంలో రోజురోజుకి ఆడపిల్లల మీద అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ అత్యాచారాలు కూడా చాలా వరకు 15 సంవత్సరాల లోపు ఆడపిల్లల మీద జరగడం గమనార్హం. మన రాష్ట్రంలో దిశ చట్టం చేసినప్పటికీ దానిని అమలుపరచడంలో విఫలం అయ్యాయని ప్రజా సంఘాలు అంటున్నాయి. ( వివరాలు 6 లో )

## జనసేన పార్టీలోకి ఇతర కార్యకర్తల చేరిక



వైజాగ్ ( జనస్వరం ) : జనసేన ప్రభుత్వం గత ఎన్నికల్లో పోటీ చేసి కేవలం ఒక ఎమ్మెల్యే అభ్యర్థి గెలిచినా ప్రజల్లో ఇంకా జనసేన పార్టీ మీద నమ్మకం ఉంది అనడానికి ఇది ఒక ఉదాహరణ. అనకాపల్లి మండలం దిబ్బ పాలెం గ్రామంలో జనసేన పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ శ్రీ పరుచూరి భాస్కర్ రావు గారి ఆధ్వర్యంలో కొందరు యువకులు పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది. ఎలాంటి సమస్య ఉన్న తనకు తెలియపరచమని అనకాపల్లి ఇంచార్జ్ అయినటువంటి శ్రీ పరుచూరి భాస్కర్ రావు గారు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గింజి సత్యరావు, కరణం నాయుడు, గంగుపాల జగదీష్, డి చక్రవర్తి, పదిశెట్టి దుర్గ, తత్ర అయ్యప్ప, కర్ణం రాము మరియు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా బారి నుంచి తమ గ్రామాన్ని కాపాడుకునేందుకు గ్రామాన్ని పిచికారి చేసిన జనసైనికులు



న్యూస్ ( జనస్వరం ) : కమలాపురం నియోజకవర్గ చింతకొమ్మదిన్నె మండలం ఇపెంట గ్రామం లో జనసేన సైనికులు అతికారి నాగేంద్ర సుబ్బు గార్ల ఆధ్వర్యంలో వర్షాల కారణంగా కరోనా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఇంపేట గ్రామం మొత్తం బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటుగా ప్రజలకు కరోనా నివారణ గురించి అవగాహన కల్పించారు.

## రోడ్డు సమస్యను పరిష్కారించాలని జగ్గయ్యపేట జనసైనికుల వినతి



జగ్గయ్యపేట ( జనస్వరం ) : జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండల పరిధిలో ఉన్నటువంటి లింగగూడెం గ్రామం నుంచి భీమవరం వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉండడంతో రోడ్ పనులని ప్రాంభించవలసినదిగా కోరుచున్నాము అని నియోజకవర్గ నాయకులు ఈమని కిషోర్ కుమార్, కొత్రపాటి గోపీచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు ( మిగతా 6లో )

## పలుమార్లు సమస్యలు విన్నవించినా పట్టించుకోని అధికారులు

- కణితి కిరణ్



టెక్కలి ( జనస్వరం) : తమ నియోజకవర్గంలోని సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జ్ కణితి కిరణ్ ధ్వజమెత్తారు. కన్నెవలస మరియు చుట్టుగుండం రెండు గ్రామాల మధ్య వంతెన పూర్తిగా దెబ్బతిన్నదని, కొత్త వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులను ( వివరాలు 6 లో )

## జనసేన - బీజేపీ పార్టీలు సంయుక్తంగా ధర్నా పేదలకు, ఇళ్ల కేటాయింపులో, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా



న్యూస్ ( జనస్వరం ) : కేంద్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆంధ్రప్రదేశ్ కి ఇప్పటివరకు కేటాయించిన లక్షల ఇళ్లనిర్మాణంపై జరిగిన, జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి దోషులని వెంటనే శిక్షించాలని, లబ్దిదారులకు ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని బీజేపీ జనసేన సంయుక్తంగా ధర్నా చేపట్టాలని ఇచ్చిన పిలుపు మేరకు అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు తమ ఇళ్ళల్లో సామాజిక దూరం పాటిస్తూ నిరసన తెలియజేయడం జరిగింది. ప్రతి పేద వాడు వాళ్ళ సొంత ఇంట్లో ఉండాలన్న సంకల్పంతో, ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో కొన్ని లక్షల ఇళ్లను నిర్మించటం జరిగింది. గత ప్రభుత్వం టీడీపీ హయాంలో నారా చంద్రబాబు నాయుడు గారు లబ్ధిదారుల ( వివరాలు 6 లో )

## క్వారంటైన్ లో ఉన్న వారికి నాణ్యమైన ఆహారం అందించాలి

- తిరుపతి జనసైనికులు




తిరుపతి ( జనస్వరం ) : తిరుపతి శ్రీనివాసంలోని క్వారంటైన్ లో ఉన్న కరోనా బాధితులకు సరైన వైద్యం అందిచట్లేదని, డాక్టర్స్ కూడా అందుబాటులో ఉండట్లేదాని , పారిశుద్ధ్యం కూడా లోపించిందని తిరుపతి పట్టణ జనసైనికులు శ్రీనివాసం క్వారంటైన్ ఎదుట ధర్నా నిర్వహించారు. 14 రోజులు పాటు క్వారంటైన్ అని చెప్పి ఇపుడు 10 రోజుల లోపే పంపిస్తున్నారని ఆవేదన చెందారు. శ్రీనివాసంలో అష్ట కష్టాలు పడుతూ దీనమైన స్థితిలో ఉన్న పేషంట్లను, ఆదుకోవాలని వారికి సరైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# మారాలి నువ్వు... ఓ 'మని'షి

ఎన్నో వేల సంవత్సరాల క్రితం కోతి రూపంలో సృష్టించబడిన మానవుడు జంతుజాలం కంటే ఎన్నో వేల రేట్లు తన మేధాశక్తిని పెంచుకున్నాడు. ఆకాశానికి ఎగురుతున్నాడు, చంద్రుణ్ణి చేరుకుంటున్నాడు, సముద్రాలను జయిస్తున్నాడు ఏవేవో ఘనకార్యాలు సాధిస్తున్నాడు. కానీ, చివరకు తనను తాను జయించలేక పోతున్నాడు. కోతినుండిపుట్టాననే పేరుసార్థకం చేసుకోవడానికే కాబోలు కోతిబుద్ధులు మాత్రం మానలేదు. ఎదుటోడిని చూసి ఇకిలించి, సకిలించి, రాయి విసిరి, వాడు తినక, ఇతరులను తిననివ్వక, తినేది కూడా లాక్కొని, కొంపను ముంచి ఆ కొంపకు నిప్పంటించి ఆనందిస్తున్నాడు...

ప్రపంచం మీద ఎన్నో కోట్ల జీవరాశి ఉంది. కానీ, జంతువులకు లేని బుద్ధిబలం కలిగిన మానవజాతి ఒక విశిష్ట మైన స్థానం సంపాదించుకుంది... మనమెన్ని ఖండాలుగా విభజించబడినా, ఎన్ని దేశాలుగా ఏర్పరుచుకున్నా, ఎన్ని రాష్ట్రాలుగా భాగించుకున్నా, ఎన్ని తెగలుగా, ఎన్ని మతాలుగా, ఎన్ని కులాలుగా ఊహించుకున్నా మనమంతా ఒక్కటే. మనమంతా ఒక సృష్టిలో పుట్టిన జీవులమే... ఈ స్వార్థంతో పరుగులు తీస్తూ జీవించే



మానవుడు తను చిరంజీవిగా నూరేండ్లు భూమ్మీద జీవం పోసుకుని ఉంటానని కలలు కంటున్నాడు. కానీ, ఆ కాలమంతా ఒక క్షణంతో సమానమని తెలుసుకోలేక పోతున్నాడు. నీవు పుట్టిందెపుడో, గిట్టెదెపుడో నీకు తెలియదు... కానీ, మట్టిలో పుట్టి మట్టిలోకలిసేది మాత్రం నీకు తెలుసు... ఆ చావు ఏ క్షణంలోనైనా రావచ్చని కూడా తెలుసు. బ్రతుకుతున్నంత కాలం ఎంత విర్రవీగినా ఆ క్షణం రాగానే అంతా శూన్యమని కూడా తెలుసు. ఇవన్నీ తెలుసుకున్నా మానవుడు ఎందుకు మూర్ఖుడవుతున్నాడో మాత్రం తెలియట్లేదు. ఎందుకు ఈ అఘాయిత్యాలకుపాల్పడుతున్నాడో, ఎందుకు ఈ రక్తపాతాలు చేస్తున్నాడో, ఎందుకు ఈ మారణహోమం తలపెడుతున్నాడో, అసలు ఎందుకు ఈ దుర్మార్గులు, ఎందుకు ఈ దౌర్జన్యాలు, ఎందుకు ఈ అవినీతి, ఎందుకు ఈ అక్రమాలు, ఎందుకు ఈ ఓర్వలేని తనాలు, నీచాతి నీచమైన పనులు, అసలెందులకీ అసూయాద్వేషాలు, దగుల్బాజీ వేషాలు. ఎందులకీ రొమ్ములు, తొడలు చరుచుకోవడం, వీపులు విరుచుకోవడం...

బ్రతకాలన్నా,
బ్రతికించాలన్నా,
కష్టపడాలన్నా,
సుఖపడాలన్నా,
బాధలైనా,
బంధాలైనా "ఈ క్షణమే"..

ఎందుకంటే నిన్న మనది కాదు,గడిచిపోయింది కాబట్టి. రేపు మనది కాదు, ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి... కనుక ఈ క్షణాన్నే మనం సద్వినియోగం చేసుకోవాలి...

ప్రతి సామాన్య మానవుడిలో అందరిలా తనలో కొన్ని బలహీనతలుంటాయి. అయినా తనలో బలమైన కోరికుంటుంది. తన బలహీనతలు తను తెలుసుకుని, తన తప్పులు దిద్దుకొని, పరిస్థితుల ప్రభావం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి చేతనైనా సహాయం చేయాలని తన అంతరాత్మ తనను ఎప్పుడూ కదిలిస్తూ ఉంటుంది... బుద్ధిబలంతో, విచక్షణా జ్ఞానంతో జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రేమానురాగాలను పెంచుకోవాలి. ధీనులని రక్షించుకోవాలి. కష్టాలతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి. అనాధలకు ఆశ్రయమివ్వాలి. చెడును తరిమి కొట్టి, మంచిని పెంచుకోవాలి. మమతలను నింపుకోవాలి. హాయిగా బ్రతకాలి కానీ హాయిగా బ్రతికే వారి జీవితాల్లో చిచ్చులు పెట్టకూడదు... ఆత్మగౌరవం, ఆత్మనిగ్రహం, ఆత్మజ్ఞానం ఈ మూడు అంశాలే జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి... ఈ భూమ్మీద ఎంతటి వారైనా ఎవరికి ఎవరు శాశ్వతం కాదు. ఈ మానవ జన్మ తోలు బొమ్మలాట. ఆడేవాడు మానవుడైతే, ఆడించే వాడు పైవాడు అని తెలుసుకోండి. మనిషి స్వార్థంతో ఎన్నెన్నో పిచ్చి పిచ్చి వేషాలు వేస్తూ అవసరమైతే నిండు ప్రాణాలను సైతం తీసి సంపాదించిన సంపద (ఆస్తులు, అంతస్తులు) ఏవైతే ఉన్నాయో వాటికి నువ్వు అనర్హుడవు. ఒకరి రక్తాన్ని నువ్వు సొమ్ముగా చేసుకుంటే నువ్వు ఎలా మనశ్శాంతిగా జీవితాన్ని సాగిస్తావో ఆలోచించుకో... జీవితమనే ఆటలో ఒక్కొక్కసారి నీ నిజాయితీ, ధైర్యం, తెలివితేటలు ఇవేవీ నిన్ను గెలిపించలేనపుడు, నీ ఓర్పు, సహనం మాత్రమే నిన్ను చివరి శ్వాస వరకు గెలిపించగలవు. దయచేసి నువ్వు ఏదైతే అనుభవించాలనుకున్నావో, సంపాదించాలనుకున్నావో, ఆనందించాలనుకున్నావో అవే ఆలోచనలతో, ఆశలతో, ఆశయాలతో ఎదుటోడు కూడా జీవితంతో పోరాటం చేస్తుంటాడని తెలుసుకుని మసులుకో... దయచేసి ఈ కోతి బుద్ధులు మాత్రం మానుకో...

ఎవరి బతుక్కైనా సలహా ఇవ్వటానికి గొప్ప విజ్ఞానం కన్నా అనుభవం, సరైన దృష్టి ముఖ్యం. ఎంతగానో దిగజారిన బతుకు భయంకరమైన మొండితనాన్నే కాదు, దానికన్న అసహ్యకరమైన మొరటుతనాన్ని ఇస్తుంది. తమ బతుకుల బాధల వెనుకాల ఉన్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక వలయాల శక్తి చాలా మందికి తెలియకపోయినా, ఏదో శక్తి తాలూకు ఒత్తిడి తమ బతుకుల మీద ఉందని ఇంచుమించు ప్రతి బడుగు బతుక్కూ తెలుసు.

~ వన్నూరప్ప

# బాధాతప్త హృదయంలోంచి భావోద్వేగాలు

~ వన్నూరప్ప



అమ్మ! అమ్మ గురించి నేలతల్లిని అడిగినా చెబుతుంది.

అమ్మ అంటేనే ఓర్పు అని,
ఓర్పు అంటేనే అమ్మ అని...
సృష్టిలో అమ్మే గొప్పది.
సృష్టిలో అమ్మ తర్వాతే ఎవరైనా...

అమ్మ! తన కడుపులో తొమ్మిది నెలలు మోసి, కని, పెంచి,ఈగ కూడా వాలకుండా పెద్దచేసి కంటికి రెప్పలా చూసుకుంటుంది... కొడుకు ఏదైనా సాధించి ఆనందంలో ఉంటే, అమ్మ పట్టలేనంతగా రెట్టింపు ఆనందంగా ఉంటుంది. అదే కొడుకు గాయపడితే అమ్మ విలవిలలాడుతూ గాయంలో అమ్మ కూడా భాగమై సపరిచర్యలు చేస్తూ కుమిలికుమిలి బాధపడుతుంది...ఇంకా ఇలా చెబుతూ పోతే బిడ్డ జీవితంలో అమ్మ పాత్ర వర్ణనాతీతం..

ఆకాశాన్ని అడిగితే చెబుతుంది అమ్మ ప్రేమ తన కంటే విశాలమని... సాగరాన్ని అడిగితే చెబుతుంది అమ్మ మనసు తన కంటే లోతని... కొండనని అడిగితే చెబుతుంది అమ్మ మమత తన కంటే తియ్యనైనదని... సరాగాల కోయిలనడిగితే చెబుతుంది అమ్మ పిలుపు తన పాట కంటే మధురమైనదని, కొవ్వొత్తిని అడిగితే చెబుతుంది అమ్మ త్యాగం తన కంటే కోటి రెట్లు గొప్పదని... సృష్టిలో అమ్మను వర్ణించడానికి ఏ పదాలు సరిపోవు...

విధి వరించి, కాలం కన్నెర్ర చేసి నన్ను జీవత్సవంలా మంచానికి పరిమితం చేసిన క్షణం నుంచి మా అమ్మకు నేను రెండో సారి జన్మించినట్లు, చిన్న పిల్లాడిలా జోపానం చేస్తూ, నిరంతరం సపరిచర్యలు చేస్తూ, రాత్రి, పగలు కంటికి కునుకు లేకుండా అల్లారుముద్దుగా చూసుకుంటుంది కానీ స్తోమత లేక మళ్ళీ నా బిడ్డను బ్రతికించుకోలేక, భూమ్మీద నలుగురిలా తిరగలేక మంచానికే పరిమితమయ్యేలా చేసుకుంటామోనని నిరంతరం కన్నీరు మున్నీరుగా లోలోపల కుమిలిపోతున్నారు... మా అమ్మ నాకు చేస్తున్న సపరిచర్యలను వర్ణించడానికి నా దగ్గర మాటలేవ్... అందుకే అంటారు ప్రపంచంలో తల్లిని మించిన యోధులు ఎవ్వరూ లేరని...

నాన్న! నాన్నంటేనే నా ఊహాలో తన ఊపిరినంత దారపోసే నిరంతర కష్టజీవి, ఎందుకంటే నేను నా కళ్లతో చూశాను. మా నాన్న ఒక కూలీ జీవి. తన కష్టాన్ని గుమ్మంలో దాచి, తన శక్తి మేరకు ఆనందాన్ని గుమ్మంలోకి తీసుకొచ్చిన కష్టజీవి. తన చెమటను దారపోసి కూలీ చేస్తూ తన రెక్కల కష్టంతో నన్ను చదివించాడు. నా కొడుకు గొప్పవాడై ఏదొకటి సాధించి, విజయకేతనం ఎగురవేసి తన జీవితంలో ఆనందాలని తీసుకొస్తాడని ఎన్నెన్నో కలలుగన్నాడు. ఆ కలలతోనే పెంచి, పెద్దచేసి, బాగా చదివించాడు. నేను కష్టపడి చదివేవాడిని.మా నాన్న కలలు నెరవేర్చాలని నిరంతరం కష్టపడి చదివేవాడిని. చదువులో బాగా రాణించడంతో తను కూలీ చేస్తూ పై చదువులు చదివించాడు.అప్పుడు నా వయసు 23 సంవత్సరాలు చదువు పూర్తి చేసుకొని ఏదొక కొలువులో స్థిరపడి జీవితాన్ని రంగులమయంతో నింపుకొని కన్న కలలన్నీ నెరవేర్చుకునే సమయం.16.01.2016 వ తేదీన విధి వరించి, కాలం కన్నెర్ర చేసి అనుకోని సంఘటన నా జీవితంలో ఎదురై కాటేసింది.ఆటో ప్రమాదంలో వెన్నెముక గాయపడి అవయవాలన్నీ చచ్చుబడిపోయి ఎటు కదలలేక మంచానికే జీవత్సవంలా మిగిలిపోయాను. కన్న కలలన్నీ అడియాసలు గా మిగిలిపోయాయి.ఒక్కసారిగా కుటుంబం మొత్తం కుప్పకూలిపోయింది.చేతిలో చిల్లిగవ్వ లేదు. నా తల్లిదండ్రులు అప్పుసొప్పు చేసి సుమారు 12 లక్షల రూపాయలు వైద్యానికి ధారపోసారు. కానీ ప్రయోజనం లేకుండా జీవత్సవంలా మంచానికే పరిమితమయ్యాను. మా నాన్నకు సమాజంలో ప్రతి ఒక్కరితో మాటలు, నిందలు, అవమానాలు, కాకుల్లా గుచ్చి గుచ్చి చచ్చిన పామును ఇంకా చంపేవాళ్లు.ఎన్నెన్నో ఒడిదుడుకులు.అన్నీ భరించి నా ఒక్కగానొక్క కుమారుడికి భవిష్యత్తు ఇవ్వలేకపోయానని నిరంతరం కృంగిపోయాడు. ఎటు దిక్కు తోచని పరిస్థితి. చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పు కూడా ఎవ్వరూ ఇవ్వట్లేదు. ఇంకా నాకు చావే శరణ్యం అనుకున్నాడు మా నాన్న. కానీ జీవితం పట్ల ధైర్యంతో కూలీ చేసి కష్టపడి గంజినీళ్లు తాగైన బ్రతికించాలని ముందుకు నడవగలుగుతున్నాడు.

నాన్న! నాన్నంటే నన్నెప్పుడూ వెంటాడే ఎమోషనల్. తన బాధను ఎప్పుడు నాకు కనబరిచేవాడు కాదు. బయటికి వెళ్లి ఏడ్చి కళ్లు కడుక్కుని ఇంట్లోకి వచ్చేవారు. ఇంకా చెప్పాలంటే మాటలు రావట్లేదు,కన్నీళ్లు తప్ప. తలుచుకుంటే గుండె బరువెక్కే సన్నివేశం. నన్ను నడిపించలేక,మంచానికే ఉంచానని కుమిలిపోతూ,వైద్యం చేయించలేని పరిస్థితి. తన కష్టార్జితం కుటుంబ పోషణకు, నా మందులకు కూడా సరిపడట్లేదు. ఒక పూట తిని,ఇంకో పూట పస్తులు ఉండే పరిస్థితి. కన్నీళ్ళతో కడుపు నింపుకుంటూ జీవితాన్ని ముందుకు నెట్టుతున్నాం... నాన్న నాకు మరొక్కసారి జీవితాన్ని ఇవ్వమని అడగాలని ఉంది. కానీ అడగలేని పరిస్థితి... ఏదిఏమైనా నేను బరువనిపించిన భరించేవాడు,కష్టం అనిపించిన మోసేవాడు నాన్న ఒక్కడే. ప్రపంచాన్ని చూడలేకున్నా కనీసం ఊపిరినైనా ఇచ్చి జీవితాన్ని ప్రసాదిస్తున్న నాన్న గారికి నా హృదయపూర్వక పాదాభివందనాలు.

~ వన్నూరప్ప
ట్విటర్ :@VannurappaBurri

# జనసేనాని ఇంటర్వ్యూ

**ప్రభుత్వ విధివిధానాలపై, సమాజ ప్రశ్నలను లేవనెత్తుతూ సమగ్ర విశ్లేషణ**

ప్రశ్న : ప్రజా శ్రేయస్సు కొరకు చాతుర్మాస్య దీక్ష్య గురించి పూర్తి వివరాలు చెప్పండి సార్ !

జవాబు : ఇప్పటి వరకూ ఇలాంటి దీక్ష్యలు కేవలం నా వ్యక్తిగతం కోసమే చేసుకొనేవాడిని. మన పార్టీ వంతు సహాయంగా ఈ కరోనా సమయంలో ఆర్ధిక సహాయం చేశాము ప్రజలకు. కానీ, భగవంతుడి ఆశీర్వదాలు కూడా అవసరం. అందుకే నేను ఈ చాతుర్మాస్య దీక్ష్య చేపట్టాను. ఈ దీక్ష్యను నేను 2003 వ సంవత్సరం నుండి మొదలుపెట్టాను. అంతకముందు అయ్యప్ప స్వామి మాలాధారణ, ఇతర దీక్ష్యలు చేసేవాడిని. కానీ నేను చేసే ఈ దీక్ష్యలు బయటకు తెలిసేవి కావు. ప్రస్తుతం నేను ప్రజాశ్రేయస్సు కొరకు ప్రజా జీవితంలో ఉన్నాను కాబట్టి బహిర్గితం చేశాను. ఈ సృష్టిని నడిపించే శ్రీ మహావిష్ణువు శయనించే కాలం ఇది. ఆయన భక్తులు ఈ కాలంలో ఈ దీక్ష్యను చేపడతారు. నేను ఈ కరోనా సమయంలో ఈ కరోనా మహమ్మారి నుంచి సమస్త మానవాళి బయట పడాలని ఈ దీక్ష్య చేస్తున్నాను.

ప్రశ్న : మన ఆంధ్ర రాష్ట్రంలో ఈ కరోనా వైరస్ ను ప్రభుత్వం సరిగ్గా ఎదుర్కోవట్లేదాని వైద్యులు అంటున్నారు. మీ అభిప్రాయం ?

జవాబు : ఈ కరోనా తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే వచ్చిన మహమ్మారి కాదు. ప్రపంచం మొత్తం వచ్చిన మహమ్మారి. మన రాష్ట్ర ముఖ్య నేతలు కూడా ఇది కేవలం ఒక ఫ్లూ అని ప్రజలను మభ్యపెట్టడం బాధాకరం. అప్పటికి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వలన చాలా నష్టం జరిగింది. కేంద్ర ప్రభుత్వం విధించిన 2నెలల లాక్ డౌన్ కాలంలో ప్రభుత్వం మరింత చర్యలు తీసుకొని ఉంటే కొంత మేర ఈ మహమ్మరి నుండి బయటపడేవాళ్లం. రాష్ట్రంలో కేవలం టెస్టింగ్ లు ఎక్కువ చేస్తున్నారు గానీ, కరోనా బాధితులను పట్టించుకోవట్లేదు అని చాలా స్పష్టం అవుతోంది. నేను కూడా ప్రభుత్వాన్ని టెస్టింగ్ లు ఎక్కువ చేస్తున్నారని మనస్ఫూర్తిగా అభినందించాను. అయితే కరోనా బాధితులకు సరైనా వైద్యం అందించట్లేదు, బాధితులకు సరిపడా వైద్య సదుపాయాలు కూడా లేవు. మన రాష్ట్రంలో ప్రజాప్రతినిధులే క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించకపోగా, ప్రజలలో కరోనా గురించి అపోహలు సృష్టించడం వలన సామాన్య ప్రజలు భయాందోళనకు గురవ్వడం బాధాకరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకొని కరోనా నివారణ మీద చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను. అలాగే ప్రజలు కూడా సామాజిక దూరం పాటిస్తూ, మాస్కులు తప్పనిసరిగా ధరిస్తూ, తమ నిరోధక శక్తిని పెంచుకోవాలని కోరుకుంటున్నాను.

ప్రశ్న : ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అవతవకలు పాల్పడుతుందని భావిస్తున్నారా ?

జవాబు : ప్రస్తుత పరిస్థితులు చూస్తోంటే నిజమే అనిపిస్తోంది. ప్రతి పేదవాడికి సొంతిల్లు అనేది కల. గత ప్రభుత్వంలో కూడా ఇందిరా గాంధీ గృహ ప్రవేశం పథకం కింద పేదలకు ఇల్లు కట్టించడం చూశాం. అయితే నేను కర్నూలు, మంగళగిరి పర్యటనకు వెళ్ళినపుడు ఇల్లు కట్టడం పూర్తి అయ్యాయి కానీ, లబ్ధిదారులకు ఇవ్వకుండా గత, ఇప్పటి ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయి. లబ్దిదారులు కొంత మొత్తంగా డబ్బులు గత ప్రభుత్వానికి చెల్లించామని, తీరా ఇప్పుడు ఈ ప్రభుత్వం కక్ష్య సాధిపు చర్యలు చేసి నిజమైన లబ్ధిదారులకు ఆ ఇళ్ళు చెందకుండా తమ పార్టీ కార్యకర్తలకు అందజేస్తున్నారని తన దృష్టికి తీసుకువచ్చినపుడు చాలా బాధాకరం అనిపించింది. బాధితుల పక్షాన నిలబడి పోరాడటం చేయడంలో భాగంగా జనసేన ~ బిజెపీ పార్టీలు ఇరువురు సంయుక్తంగా



ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నా కూడా కార్యకర్తలు అందరూ కూడా తమ ఇళ్ళల్లో సామాజిక దూరం పాటిస్తూ నిరసన చేయడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని నిజమైన లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రశ్న : పేదలకు ఇచ్చే భూముల విషయంలో మరియు భూ సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని భావిస్తున్నారా ?

జవాబు : ఎన్నికల్లో ఇచ్చే హామీలను చాలా వరకు అమలుపరచకపోవడం, ఆ మోసపూరిత విధానాలను అర్థం చేసుకొని ప్రజలు ఉన్నంత వరకూ ఇలాంటి పరిస్థితి తప్పదు. ప్రజలు గుర్తించుకోవాల్సిన విషయం ఏంటంటే ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నారంటే కాస్తా ఆలోచించాలి, ఎందుకంటే అది సాధ్యమయ్యే పనేనా అని, స్వాతంత్ర్యం వచ్చిన కాలం నుండి ఇప్పటివరకూ అన్ని ప్రభుత్వాలు కూడా ఇళ్ల పట్టాలు ఇస్తున్నా కూడా ఇంకా పేదలు ఎందుకు మిగిలారు. ఎన్నికల హామీల్లో కొన్ని లక్షల మందికి ఇస్తామని, తర్వాత కొందరికి మాత్రమే ఇచ్చి అందరికీ ఇచ్చినట్టు ఈ ప్రభుత్వాలు పబ్లిసిటీ చేసుకుంటున్నాయి. ముఖ్యంగా దళితుల భూములు, అసైన్డ్ భూములలో అవతవకలు జరుగుతున్నాయి. నాకు వచ్చిన సమాచారం బట్టి ప్రైవేట్ భూములను దళారీలు అతి తక్కువ ధరకు ప్రజల దగ్గర కొని, ప్రభుత్వం దగ్గర 5 రెట్లుకు పైగా అమ్మేలా చేస్తూ, ప్రజల సొమ్మును దుర్వినియోగం అయ్యేలా చేస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి అవతవకలను ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేయాలని, ఒకవేళా ఆ అర్హులకు ఇవ్వని పక్షంలో ఎందుకు ఇవ్వట్లేదో జవాబుదారీతనం ఇవ్వాలని కోరుతున్నా.

ప్రశ్న : రాజధాని విభజన, సి ఆర్ డీ ఏ బిల్లుల విషయంలో మీ అభిప్రాయం ?

జవాబు : మూడు రాజధానుల బిల్లు, సి ఆర్ డీ ఏ రద్దు బిల్లు అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదింపచేయడం జరిగింది. మండలిలో ఈ బిల్లుకు ఆమోదం అవసరం లేదని ఆ బిల్లును గవర్నర్ దగ్గరకు పంపగా పెండింగ్ లో ఉండడం చూస్తున్నాం. జనసేన పార్టీ పెద్దలు కూడా ఈ విషయమై స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజిస్తున్నపుడు హైదారాబాద్ లాంటి పెద్ద నగరం మన ఆంధ్రప్రదేశ్ లో లేకపోవడం బాధాకరమని నాతో చర్చించారు. అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ కొన్నివేల సేకరించడం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఒక తప్పు నిర్ణయం. ఇప్పటికీ కూడానూ నా వ్యక్తిగత తరపున, పార్టీ తరుపునా అన్ని వేల ఎకరాలు సేకరించడం ఒక తప్పిద నిర్ణయం. అన్ని వేల ఎకరాలు రైతుల దగ్గర నుంచి సేకరించి సింగపూర్ లాంటి రాజధాని నిర్మిస్తాము అంటే అక్కడి తరహా వ్యవస్థ, రాజకీయ విధానము లేదు మన దగ్గర. నేను ఆరోజు కూడా రైతులకి, తెలుగుదేశం ప్రభుత్వంకు చెప్పా, ఒకవేళ రాజధాని అభివృద్ధి చేయలేదంటే మొదటికే మోసం వస్తుందని చెప్పడం జరిగింది. ఇప్పటి వైసీపీ ప్రభుత్వం ఆరోజు అసెంబ్లీలో అమరావతి రాజధానికి అంగీకరించి నేడు మూడు రాజధానులకు మొగ్గు చూపడం హాస్యాస్పదం. రైతులు ఇచ్చినా భూముల్లో ఏవైనా అవకతవకలు జరిగింటే సరిచేయాలి గానీ, పోరాటం చేస్తున్న రైతుల మీద పోలీసుల జులుం విధించడం సరికాదు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి గాని ఇలా జరగడం సవ్యం కాదు.

ప్రశ్న : మన రాష్ట్రంలో దళితుల మీద జరుగుతున్నా ఆరాచకల మీద స్పందన ఏంటి?

జవాబు : సాక్షాత్తు ఈ రాష్ట్ర హోమ్ మంత్రి దళిత వర్గానికి చెందిన ఆమె పరిపాలనలో దళితుల మీద దాడి జరగడం బాధాకరం. ఆ దళిత వర్గం నుంచి వచ్చిన ఆమె వారికి రక్షణ కల్పించకపోవడం బాధాకరమైన విషయం.

ప్రశ్న : రాజమండ్రిలో జరిగిన శిరోముండన కేసులో దోషులపై కేసులు నమోదు చేయకపోవడం వెనుక మీ ఆంతర్యం ఏమిటి ?

జవాబు : అప్పట్లో దళిత డాక్టర్ సుధాకర్ మీద పని చేసిన వ్యవస్థ ఇపుడు ఈ శిరోముండన కేసులో ఎందుకు మూగబోయింది. ఆ వ్యవస్థ పని చేయకపోగా ప్రభుత్వ కార్యకర్తల్లాగా పోలీసు వ్యవస్థలో పని చేయడం అనుమానాలకు దారి తీస్తోంది. ఆ సంఘటనకు కారణం అయిన వారిని ప్రభుత్వం శిక్షించకపోతే, రాబోయే రోజుల్లో దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోరాటం ఉధృతం చేయవచ్చు.

ప్రశ్న : వైసీపీ ప్రభుత్వం పరిపాలన కాలం సంవత్సరం దాటింది. ఈ ప్రభుత్వం పై మీ విశ్లేషణ ఏమిటి ?

జవాబు : ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి అత్యధిక, స్థిరంగా ఉండే మెజారిటీని ఆ దేవుడు వాళ్ళకు కల్పించాడు. ఇలాంటి బలాన్ని ఆ పార్టీ కొందరి వ్యక్తుల కోసమో, కొన్ని కులాల కోసమో పని చేయడం బాధకరం. ఒక సంవత్సర కాలంలో న్యాయ వ్యవస్థ దాదాపుగా 62 సార్లు మొట్టికాయలు వేయడం చూశాం. ఇంత తక్కువ కాలంలో ప్రభుత్వ విధానాలను న్యాయ వ్యవస్థ తప్పు పడుతుందంటే ఎంత దారుణంగా పరిపాలన సాగుతుందో మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రశ్న : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విపరీతమైన అప్పులు చేసి, ప్రజల మీద భారం మోపుతుందని మీరు ఎలా భావిస్తారు ?

జవాబు : మన రాష్ట్రం అప్పులు దాదాపుగా 3.30 లక్షల కోట్లు చేసి, ఆ మొత్తాన్ని ప్రజల మీద భారం మోపడం అనేది ఒక నికుంశక చర్య. సామాన్య ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాలంటే ఒక కుటుంబ పెద్ద అప్పులు తెచ్చి, సంసారాన్ని నడుపుతుంటే ఒకానొక దశలో ఆ అప్పులు విపరీతంగా పెరిగి తమ కొడుకుల మీద భారం పడుతుంది. గత ప్రభుత్వంలో కూడా అప్పులు చేశారు, ఇప్పుడున్న ప్రభుత్వాలు అప్పుల దిశగా వెళ్లకుండా ఆదాయ మార్గాన్ని సమకూర్చుకొని ఆ అప్పులను తీర్చే విధంగా కష్టపడాలి. అలా అయితే రాష్ట్రం అభివృద్ధి చెందడమే కాకుండా, తద్వారా పరిశ్రమలు కూడా వస్తాయి. సామాన్య ప్రజలకు ఎప్పుడు కూడా విద్యా, ఉఫాధి, వైద్య సదుపాయాలు అందకుండా బలయ్యిపోతాడు. ఇలా నడిచే ప్రభుత్వం తిరోగమన వైపుగా వెళుతోంది.

ప్రశ్న : న్యాయ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనను తప్పు పడుతూ దాదాపుగా 62 సార్లు మొట్టికాయ వేసిన సందర్భం దీని గురించి మీరు ఏమంటారు ?

జవాబు : ప్రభుత్వంలోని పోలీసు, వైద్య, రెవెన్యూలాంటి వ్యవస్థ అధికారులు ఇపుడున్న పార్టీకి కొమ్ము కాయడం చేత ఇలాంటి ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని మనం ఊహించొచ్చు. న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండడం వల్ల ప్రభుత్వాలను హెచ్చరించే అధికారాలు ఉండడం వల్ల కాస్తాయినా ప్రభుత్వాలు భయంతో పని చేస్తున్నాయి. ఇలాంటి తప్పులే ఇంకా కొనసాగితే ప్రజల ఆగ్రహానికి గురయ్యే ఛాన్సులు ఎక్కువగా ఎక్కువగా ఉన్నాయి. ఒకసారి మనం అగ్రరాజ్య అమెరికా దేశాన్ని చూస్తే ఒక నల్ల జాతీయుడిని చంపిన వైనానికి ( మిగతా తరువాత పేజీలో )

సందర్భం చూశాం. ఒక రాష్ట్ర స్థాయి డీజీపీ వచ్చి సమాధానం చెప్పాలని కోర్టు చెప్పిన సందర్భం వచ్చిందంటే మన రాష్ట్ర పరిపాలన వ్యవస్థ ఎంత దెబ్బ తిన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి చర్యలు వల్ల ప్రభుత్వ అధికారులు బలయ్యే అవకాశం ఉంది.

**ప్రశ్న : ఈ కరోనా కారణంగా విద్యా వ్యవస్థ వెనుకబడటం, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న అక్రమాలపై మీ అభిప్రాయం ?**

జవాబు : నా పిల్లలు కూడా చదువుకుంటున్నారు కాబట్టి ఈ విషయం మీద కొంత స్వానుభవం ఉంది. ఇందులో రెండు రకాల సమస్యలు ఉన్నాయి. ఒకటి డబ్బులు ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలు ఆన్లైన్ క్లాసులు నిర్వహించడం. ప్రభుత్వ పాఠశాలలో ఇటువంటి సదుపాయం లేకపోవడం బాధాకరం. ఒక విద్యా సంవత్సరం పూర్తిగా సమసిపోయే అవకాశాలు ఉంటే బాధాకరం అనిపిస్తోంది. కార్పొరేట్ యజామాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసి ఆన్లైన్ క్లాసులు నిర్వహించి దోపిడి చేస్తుంటే, ప్రభుత్వ స్కూళ్ళల్లో ఏటువంటి సదుపాయాలు లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఒక నిర్ణయానికి రావాలి.

**ప్రశ్న : ఈ కరోనా మహమ్మారి వల్ల రెండు తెలుగు రాష్ట్రాల యొక్క వైద్య సదుపాయాల డొల్లతనం కనిపించింది దీని గురించి మీరేమంటారు ?**

జవాబు : గత శతాబ్దాలుగా మన దేశంలో వైద్యానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వలేదని ఈ కరోనా కాలంలో స్పష్టంగా అర్థం అవుతోంది. వైద్య శాఖను ఒక స్వయం ప్రతిపత్తిగా మార్చలేకపోయారు ఈ పాలకులు. ఒకసారి మనం ఇంగ్లాండ్ లో వైద్య విధానాన్ని చూస్తే అర్థం అవుతుంది అక్కడి ప్రభుత్వాలు వైద్యానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నాయో. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా తగిన వైద్య సదుపాయాలు లేవని స్పష్టం అవుతోంది. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులను కూడా ఇంకా మెరుగ్గా అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉంది. అలాగే తెలంగాణ ప్రాంతం నుంచి అనేక మంది నాకు ఫిర్యాదులు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని వైద్య సదుపాయాల మీద స్పందించమని. తొందర్లోనే మా పార్టీ సమావేశం నిర్వహించి వైద్య సదుపాయాల గురించి విజ్ఞప్తి చేస్తాం.

**ప్రశ్న : కరోనా లాంటి మహమ్మారి సమస్య ఎదురైనపుడు ప్రభుత్వాలు మరియు పౌరుల బాధ్యత ఏ విధంగా ఉంటుంది. మీరు దీనిని ఏ కోణంలో చూస్తారు ?**

జవాబు : నాయకత్వం బలంగా ఉంటే కింది స్థాయి నాయకులు కూడా తూ.చా పాటిస్తారు ఏ విషయాన్నైనా. దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడి గారు ఒకసారిగా లాక్ విధిస్తే దాదాపుగా 130కోట్ల ప్రజానీకం పాటించారు. ఇక్కడ మనకు నాయకత్వం ఎంత బలంగా ఉందో అర్థం అవుతోంది. రాష్ట్ర స్థాయి నాయకులు దీనిని ఒక ఫ్లూ లాంటి మాటలతో మభ్య పెట్టడం వల్ల దారుణమైన పరిస్థితి నెలకొన్న విషయం చూశాం. ప్రభుత్వ పాలకులు సరైన దిశానిర్దేశం చేయలేనపుడు ప్రజలు కూడా అస్తవ్యస్తముగా తయారు అవుతారు. ప్రజాప్రతినిధులే నిర్లక్ష ధోరణి వహిస్తుంటే ప్రజలు కూడా ఆ దిశగా వెళ్ళే ఆస్కారం ఉంది. ప్రజలు సామాన్య దూరం పాటిస్తూ, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, అలాగే వ్యాధి నిరోధక శక్తికి సంబంధించిన ఆహారం తినాలని సూచిస్తున్నాను. ప్రజలు కూడా ప్రభుత్వాల మీద ఆధారపడటం కూడా కాస్తా ప్రమాదకరమే.

**ప్రశ్న : కాపు కార్పొరేషన్ మీద శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. అలాగే ఇతర కార్పొరేషన్ నిధుల గురించి వివరణ ఇవ్వాలని కోరారు, దీని మీద స్పందన ఏమిటి ?**

జవాబు : మన ప్రజాస్వామ్యంలో ఏదైనా సమస్య వస్తే దానికి అప్పుడే సమస్యకు పరిష్కారం దిశగా ఆలోచించి పోరాడాలి. లేదంటే ఆ సమస్య మరింత తీవ్రత అయ్యి పెద్దదిగా మారే అవకాశం ఉంది. సామాజిక, ఆర్థిక అంశాలని దృష్టిలో ఉంచుకొని ఈ కార్పొరేషన్లు పెట్టడం జరిగింది. ఆ రోజున మేము శ్వేతపత్రం జనసేన పార్టీ తరుపున అడిగింది ఒక కులానికి సంబంధించి కాదు, అన్ని కులాల కార్పొరేషన్ల నుంచి శ్వేత పత్రం అడిగాము. గతంలో ఒకసారి నేను అరకు వెళ్ళినపుడు అక్కడి గిరిజన యువత మాకు విద్యావంతులం అయ్యి కూడా మా కులానికి చెందిన కార్పొరేషన్ నుంచి నిధులు అందక నిరాశ్రయులం అవుతున్నామని, ప్రతి యేటా బడ్జెట్ లో నిధులు కేటాయిస్తున్నా మాకు చెందకుండా ఆ నిధులు ఎటు వెళ్తున్నాయో పోరాటం చేయాలని కోరారు. ఇప్పుడు ఉన్న వైసీపీ ప్రభుత్వం కూడా కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్ళించడం దారుణం. అందుకే ఈ విషయమై మేము శ్వేత పత్రం అడిగినా ఇప్పటి వరకూ విడుదల చేయక పోవడం ఆ ప్రభుత్వం యొక్క అవినీతికి నిదర్శనంగా నిలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం అప్పుడు ఎన్నికల హామీల్లో భాగంగా కాపు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు మాట తప్పడం చూస్తున్నాం.

**ప్రశ్న : జనసేన పార్టీ నిర్మాణానికి భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు?**

జవాబు : ఒక కొత్త రాజకీయ వ్యవస్థను కోరుకున్న నేను నాకున్న అశేష అభిమాన జనంతో ఆరోజు హైదరాబాదులో పార్టీ స్థాపించడం జరిగింది. ఇపుడున్న పార్టీలు ఒక కులానికో, ఒక మతానికో ఆపాదించడం నాకు నచ్చదు. అందుకే జనసేన పార్టీని జాతీయవాద పార్టీగా, పాతికేళ్ళ భవిష్యత్తు కోసం, నవతరం యువకుల్ని తయారు చేయడానికి ఆ దిశగా ముందుకు వెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తాం. ఒక పార్టీ అన్నాక ఒడిదుడుకులు, కష్టాలు ఉంటాయి వాటిని దాటుకొని బలంగా ముందుకు వెళ్లడానికి ప్రయత్నం చేస్తాము. ఇప్పటి వరకూ 100 కు పైగా బలమైన అభ్యర్థులు ఉన్నారు, ఇంకా బలోపేతం చేస్తాం.

**ప్రశ్న : మోడి గారు అధికారంలోకి వచ్చాక వెనుకబడిన అగ్రవర్ణాల కులాలకు రిజర్వేషన్లు కల్పిస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నీరు గార్చే విధంగా చేశారు అంటున్నారు. వీటి మీద మీ అభిప్రాయం ?**

జవాబు : నేను చాలా పర్యటనల్లో వెళ్ళినపుడు చాలా మంది నన్ను వెనుకబడిన అగ్రవర్ణ కులాలు వారు ఆర్థికంగా వెనుకబడ్డాము, మాక్కూడా రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించేవారు. ఇలాంటి రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించినపుడు చాలా సంతోషం వేసింది. ఈ విషయంలో దేశమంతా హర్షించదగ్గ విషయం. ఈ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలకి మీరే నిర్ణయించుకోండి అని అవకాశం ఇవ్వగా, అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం కాపు కులానికి 5% రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో తీర్మానించి, ఆమోదం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఇక్కడ ఇవాల్సిన EBC రిజర్వేషన్లు కల్పించకపోగా, అటు కాపు రిజర్వేషన్లను కల్పించకపోగా నీరుగార్చారు.

**ప్రశ్న : ఈ లాక్ డౌన్ కాలంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడి గారు ' ఆత్మ నిర్భర భారత్ ' కు 20 లక్షల కోట్లు ప్రకటించారు. ఇది అభివృద్ధికి ఎలా ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు?**

జవాబు : కేంద్ర ప్రభుత్వం ఈ కరోనా లాక్ డౌన్ కాలంలో ఈ ' ఆత్మ నిర్భర భారత్ ' పథకం ద్వారా 20లక్షల కోట్లు ప్రకటించడం బాధాకరం. అయితే ఇక్కడ ప్రతిపక్షాలు ఎలా చూస్తున్నాయి అంటే నా వాటా కింద ఎన్ని లక్షలు వచ్చాయి, సామాన్యుడికి ఎంత డబ్బులు ఇస్తున్నారు అని అవివేకతనంతో మాట్లాడడం హాస్యాస్పదం. ఈ లాక్ డౌన్ కాలంలో ప్రజలు ఆర్థికంగా వెనుకబడిపోయారు. వారికి బ్యాంక్ ద్వారా రుణాలు అందించి ఉపాధి కల్పించి తద్వారా, వారు ఆర్థికంగా మెరుగు అవ్వాలనేది లక్ష్యం.

**ప్రశ్న : ఈ మధ్య కాలంలో చైనాతో యుద్ధమేఘాలు కమ్ముకునే పరిస్థితి దాకా వచ్చింది. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి ?**

జవాబు : మా నాన్న ఆస్తికలను త్రివేణి సంగమంలో కలపడానికి వెళ్ళిన ఆ సమయంలోనే ముంబై లో దాడులు జరగడం, అలాగే దేవాలయం లాంటి పార్లమెంట్ మీద దాడి జరగడం నాకు బాధ అనిపించింది. అలాంటి సంఘటనలు జరిగినప్పుడు వీటిని బలంగా ఎదుర్కొనే బలమైన నాయకులు దేశానికి అవసరం అనిపించింది. అపుడు నాకు మదిలో మోడి గారు ఒక బలమైన నాయకుడిగా అనిపించారు. ఈ రోజు చైనా కవ్వింపు చర్యలు చూస్తే నాకు చిన్నప్పటి పాఠ్యపుస్తకాలు గుర్తొచ్చాయి. వాటిలో మన దేశ భూభాగాన్ని వాళ్ళు లాక్కున్నారు, వీళ్ళు లాక్కున్నారు అనే ఉంటుంది. మనం కూడా పోరాటం చేయొచ్చు కదా వాళ్ళ దేశాల మీద అనే ఆవేశం గల తరం నుంచి వచ్చాము. సరస్సులో ఉన్న మొసలిని నమ్మొద్దు, చైనాలో ఉన్న చైంఫీలను నమ్మొద్దు అని బాలగంగాధర్ తిలక్ చెప్పిన ఆవేశం గుర్తొచ్చింది. ఇలాంటి సమయాల్లో వారిని తిప్పి కొట్టడానికి ఒక బలమైన నాయకత్వంగా మోడి గారు గుర్తొస్తారు. ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను పెంచుకోవడం కూడా ఒక బలమైన కారణం. బలమైన ఆర్థిక, ఆయుధ సంపద కలిగిన చైనా ను భయపెట్టడం అంటే చాలా చిన్న విషయం కాదు. ఈ రోజు మోడి గారి ధైర్య నిబద్ధత వల్ల దేశం మొత్తం గర్విస్తోంది.

**ప్రశ్న : వృత్తి ఆధారిత, ఉపాధి సంబధిత వారు, చేతివృత్తి కలిగిన వారు ఆదాయాన్ని కోల్పోవడం, వీటికి ముగింపు పలకాలంటే ఏం చర్యలు తీసుకోవాలి ?**

జవాబు : మనదేశం వృత్తి ఆధారిత కులాలతో కూడిన సమాజం మనది. నేను ఎమ్మిగనూరులో వస్త్రాలు కనుగోలు చేసినప్పుడు వారు నాతో చెప్పిన విషయం ఏంటంటే మాకు చేనేత ఆదాయ వనరు కల్పించాలని కోరారు. భవన నిర్మాణానికి ముడిసరుకు లాంటి ఇసుక అందుబాటులో లేనప్పుడు భవన నిర్మాణ కూలీలకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడున్న వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఇసుక అనేది అందని ద్రాక్షలా తయారయ్యిందని పార్టీ నాయకులు కూడా నాతో విన్నవించారు. ఇసుక మాఫియా కూడా ఈ ప్రభుత్వంలో పెట్రేగిపోతుందని అర్థం అవుతోంది. స్వర్ణకారులు కూడా నాతో చెప్పింది ఏంటంటే కార్పొరేట్ ఆభరణాల షాపులు రావడం వల్ల మా పరిస్థితి దారుణంగా తయారు అయ్యిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం విధానపరమైన పాలసీలు తీసుకుంటే చెల్లాచెదురైన వీరిని ఆదుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**ప్రశ్న : మీ రాబోయే సినిమాల గురించి ఏమైనా చెప్పగలరా ?**

జవాబు : ఇపుడున్న పరిస్థితుల్లో సినిమాలు తీసే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు షూటింగ్స్ కు అనుమతి ఇచ్చినప్పటికి నిర్వహించలేని పరిస్థితి. ఈ కరోనా మహమ్మారికి వ్యాక్సిన్ వచ్చి కాస్తాయినా కుదుటపడితే తప్ప షూటింగ్ లు నిర్వహించలేము. అమితాబ్ బచ్చన్ గారికి కూడా కరోనా రావడం కూడా చూసాము.

**ప్రశ్న : ఈ లాక్ డౌన్ కాలంలో మీ పార్టీ జనసైనికులు చేసిన సహాయం చూస్తే మీకు ఏమి అనిపిస్తుంది ?**

జవాబు : ఈ కరోనా లాక్ డౌన్ కాలంలో జనసైనికులు మనస్ఫూర్తిగా స్పందించి జనసేవ చేయడం నాకు హృదయాన్ని కదిలించింది. ఒక కేజీ కాయగూరల నుంచి ఒక దేశం నుండి ఇక్కడికి స్వదేశీయులను తీసుకు రావడానికి 2 విమానాలను ఏర్పాటు చేసేంత సాయం చేయడం నాకు చాలా గర్వంగా అనిపించింది. మనస్ఫూర్తిగా జనసైనికులను అభినందిస్తున్నాను. సమాజంలో ఒక వ్యక్తిని అభినందించి ఇంతలా సేవ చేయడం నాకు ఆనందాన్ని ఇచ్చింది. కేవలం మన స్వార్థం కోసమో కాకుండా, మన కుటుంబం కోసమో కాకుండా సమాజం కోసం ఇంతగా తపించి సేవ చేసిన ప్రతి జనసైనికునికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా. ఇలాంటి జనసైనికులు నాకు చాలా గర్వకారణం. ఇలాంటి సేవలే భవిష్యత్తులో పార్టీ నిర్మాణానికి బలంగా దోహదపడుతాయి. ఇంత ఓటమి తర్వాత కూడా స్థానికంగా తమ సమస్యలను వెలికితీసి పరిష్కారం దిశగా పని చేయడం నాకు ఆనందాన్ని ఇస్తోంది. ఇలాంటి జనసైనికుల కోసమైనా నేను బలంగా పార్టీ కోసం నిలబడతా. (నా శవాన్ని నలుగురు వచ్చి మోసేవరకూ నేను జనసేన జెండా మోస్తాను ).

## జనసేన ప్రెస్ నోట్స్

### జీ +3 లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకూ జనసేన పోరాటం ఆపదు

జీ +3 గృహాల కేటాయింపు వ్యవహారంలో లబ్ధిదారులకు న్యాయం చేకూరేవరకూ జనసేన - బీజేపీ పార్టీలు సంయుక్తంగా కలసి పోరాటం చేస్తాయని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు చెప్పారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులు కొంత మొత్తాన్ని డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించారని, తీరా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ కేటాయింపులు జరగకుండా వాయిదా వేశారు. ఇపుడు అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం వచ్చి వాటి గురించి పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు ఇవ్వడంతో రాష్ట్రంలో చాలా చోట్ల నిర్మాణం కూడా పూర్తయ్యిందని, కానీ వాటిని లబ్దిదారులకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ జీ +3 గృహాల కేటాయింపులో భాగంగా గత ప్రభుత్వంలో లబ్ధిదారులు రూ. 50 వేల నుంచి రూ. లక్ష రూపాయల వరకూ ప్రభుత్వానికి చెల్లించామని లబ్దిదారులు వాపోతున్నారు. ఇపుడు ఉన్న ప్రభుత్వంలో అధికార పార్టీ కార్యకర్తలకే ఇచ్చే విధానంగా అవినీతి కొనసాగుతోందని మా దృష్టికి వచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రానికి 24 లక్షల ఇళ్లను కేటాయించింది. అందుకు సంబంధించి రూ. 5 వేల కోట్ల రూపాయల నిధులను కూడా కేటాయించడం జరిగింది. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడంలో రెండు ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. మన రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా భారీగా అవినీతి జరిగిందని మా దృష్టికి వచ్చిందని తెలుపుతూ ఇరు పార్టీలు సంయుక్తంగా కలసి పోరాటం చేస్తామని తెలిపారు.

### దళిత యువకుడిని శిరోముండనం వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ బాధ్యుల్ని చేయాలి

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం పోలిసు స్టేషన్లో శ్రీ వరప్రసాద్ అనే యువకుడిని శిరోముండనంచేసి,చిత్రహింసలకుగురిచేయడం బాధాకరం. ఇలాంటి చర్యలు మన సమాజంలో తలవంపులు తెచ్చే హీనమైన చర్య. అధికార పార్టీ ఆగడాలతోనే పోలీసులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇసుక అక్రమ రవాణా చేసే లారీలు చాలా ప్రమాదకరంగా మారాయని సీతాపురం గ్రామ ప్రజలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఆ అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు దళితుడైన వరప్రసాద్ మీద కేసులు బనాయించడమే కాకుండా, పోలీసు స్టేషన్లో శిరోముండనం చేయడం బాధాకరం. ఇసుక మాఫియాలను ఆపడానికి తమ వంతు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అడ్డుకుంటున్న ఇలాంటి వారిపై ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగడం దారుణం. ఈ ఘటనకు పోలీసులను ప్రేరేపించిన అధికార పార్టీ నాయకుల మీద చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమీటీ చైర్మెన్ నాదెండ్ల మనోహర్ గారు కోరారు .

### దళితులపై దాడులు నిత్యకృత్యంగా మారాయి

రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకి ఎక్కువఅవుతున్నాయి.సీతానగరంపోలీసుస్టేషన్లో దళిత యువకుడి శిరోముండన ఘటన మరువక ముందే ఇపుడు మరో ఘటన చోటు చేసుకుంది. చీరాలలో పోలీసులు ఒక దళిత యువకుడిని పొట్టన పెట్టుకున్న విషయం బాధాకరం. చీరాల థామస్ పేటకు చెందిన శ్రీ ఎరిచర్ల కిరణ్ కుమార్ అనే దళిత యువకుడు మాస్కు ధరించకుండా రోడ్డు మీదకు వచ్చాడని అతనిపై సబ్ ఇన్స్పెక్టర్ లాఠీతో తీవ్రంగా బాదడంతో ఆ యువకుడు ప్రాణాలు విడిచాడు. చీరాల పోలీసు వారి చర్యను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. జనసేన పార్టీ తరుపున మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. శ్రీ కిరణ్ కుమార్ గారి మరణానికి కారణమైన పోలీసు అధికారిని ఆ కేసు నుండి తప్పించే ప్రయత్నంగా ఉంది. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము. రాష్ట్రంలో దాడులు రోజు రోజుకి పెరుగుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. ఇలాగే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదు అని అన్నారు. ఇకనైనా వైసీపీ ప్రభుత్వం మేలుకొని నిందితులకి కఠినమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మెన్ నాదెండ్ల మనోహర్ గారు కోరారు. రాష్ట్ర హోం శాఖ మంత్రిగా దళిత కులానికి చెందిన వారు అయ్యి ఉండి కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరం. ఇలాంటి దాష్టీకాలు ఎన్ని చోటు చేసుకున్నా అడ్డుకట్ట వేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని తెలియజేస్తుంది.

### ఆక్సిజన్ కొరత మూలంగా పాత్రికేయుడు మరణించడం బాధాకరం

ఈ కరోనా విపత్కర సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాత్రికేయుడు శ్రీ సుంకర రామారావు గారికి ఆక్సిజన్ అందక చనిపోయిన విషయం తెలిసి బాధాకరంగా లోనయ్యాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. రాష్ట్రంలో ఆరోగ్య పరిస్థితులు దారి తప్పాయి అని చెప్పడానికి ఇది ఉదాహరణ. ఈ కరోనా విపత్కర సమయంలో ప్రభుత్వం మరింత చొరవ తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలి. ఆసుపత్రుల్లో తగిన ఆక్సిజన్ నిల్వలు ఉండట్లేదాని జిల్లా పార్టీ నాయకులు కూడా నా దృష్టికి తీసుకు రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ ఆక్సిజన్ నిల్వల విషయంలో ప్రణాళికబద్ధంగా నిర్వహించాలి. కరోనా మహమ్మారి వచ్చిన నాటి నుండి పాత్రికేయులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా భిన్న కోణాల్లో వార్తలు, కథనాలు అందిస్తున్నారు. భీమా కార్డులు కూడా అన్ని ఆసుపత్రులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాత్రికేయులను ఫ్రంట్ లైన్ వారియర్స్ గా గుర్తించి వారికి తగిన సదుపాయాలు అలాగే ఇన్సూరెన్స్ కల్పించాలని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు కోరారు.

### మూడు రాజధానులు మా విధానం అని వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడే చెప్పాల్సింది

వైసీపీ ఆ రోజు ప్రతిపక్షంలో ఉన్నారు. ఆ రోజే 'మేము మూడు రాజధానులనే నమ్ముతున్నాం' అంటే ఇంత మంది భూములు ఇచ్చేవారు కాదేమో. అంతా ఒప్పుకున్న తర్వాత, రకరకాల కారణాలు చెప్పి ఈ రోజు మారుస్తామంటే వంచించిన వాళ్లమవుతాం. దాని పర్యవసనాలు ఒక్క సంఘటన జరిగితే బయటకు వస్తాయి. చాలా సున్నితంగా ఆలోచించాల్సిన అంశం. రైతులని ఇబ్బందిపెట్టడం సరికాదు. వారి కన్నీళ్లు మంచిది కాదు. రైతు పెట్టే కన్నీరు ఎవర్నయినా మలమల మాడ్చేస్తుంది. అందుకే ప్రభుత్వాలుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ సున్నితంగా దీన్ని హ్యాండిల్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇక్కడ రాజధాని లేదు.. మూడు రాజధానుల ద్వారా వికేంద్రీకరణ మీద మేము అసెంబ్లీలో తీర్మానం చేశాం.. కాబట్టి మండలిలో ఆమోదం అవసరం లేదని రకరకాల టెక్నికాలిటీస్ పేరుతో ఆ బిల్లులను గవర్నర్ గారికి పంపించి ఆయన ఆమోదం కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. రెండు, మూడు వేల ఎకరాల్లో చక్కటి, బలమైన రాజధాని చేసుకోవచ్చు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాళ్లు చేసిన తప్పు ఏంటంటే.. అది వాళ్ల విధాన నిర్ణయమా, ఆలోచించి చేసిందా, కారణాలు ఏమైనప్పటికీ అంత భూమిని సేకరించడంపై నాటి నుంచి నేను ఒకటే చెబుతూ వస్తున్నాను పార్టీ పరంగా కూడా.. రైతుల దగ్గర నుంచి ఇన్ని భూములు తీసుకుని సింగపూర్ తరహా రాజధాని కట్టాలి అని అంటే, సింగపూర్ లాంటి వ్యవస్థ ఉండాలి. లీక్వాన్ యూ లాంటి వ్యక్తి ఉండాలి. అక్కడ అన్ని జాతులవారినీ సింగపూర్ వారీగా ట్రీట్ చేయగలిగారు. అలాంటి ఉన్నతమైన మనసు. అలాంటి రాజకీయ విధానం ఇక్కడ మనకి లేదు. రాజకీయ విధానం లేకుండా సింగపూర్ తరహా రాజధాని అంటే కాన్సెప్ట్ అమ్మేయడానికి చేశారు. అంతంత భూములు తీసుకుంటున్నప్పుడు మొదటి నుంచి రైతులకు చెప్పాను.. అంత స్థాయిలో భూములు తీసుకుంటే ఎప్పటికైనా ఇబ్బంది అవుతుంది.. అభివృద్ధి చేయనప్పుడు కష్టం అవుతుంది అని. ఆ రోజున అందరూ మద్దతు తెలిపారు. ఈ రోజున రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి భావోద్వేగాలు చాలా సున్నితంగా ఉంటాయి బయటకు కనిపించవు. దెబ్బలు తినీ తిని అవమానం పడి ఉన్నారు. నందిగ్రాంలో వెయ్యి ఎకరాల లోపుకే అంత గొడవ జరిగిన దానికి ఇన్ని వేల ఎకరాలకు చిన్న సమస్య అని నిర్లక్ష్యంగా వదిలేస్తే మాత్రం ఇబ్బంది తప్పదు. టీడీపీ-వైసీపీ ఆధిపత్య పోరులో రైతులు నలిగిపోతారు. వాళ్లిచ్చింది... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి. అది దృష్టిలో పెట్టుకుని రైతులకు అండగా నిలబడాలి. ఏ పార్టీ అయినా, మేం మొదటి నుంచి అదే విధానం తీసుకున్నాం. ఈ రోజుకి అదే మాట మీద ఉన్నాం. ఇందులో ఇంకో సున్నితమైన అంశం ఏమంటే పక్క జిల్లాలకి ఏదైనా ఇబ్బంది పడుతుంది అంటే.. కొన్ని విషయాల్లో నిర్మోహమాటంగా మాట్లాడుకుని చేయాలి, సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి అని జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు చెప్పారు.

## జనసైనిక్ పంచ్

- శ్రీ శ్రీనివాస్ కుసుమపూడి జనసేన పార్టీ అధికార ప్రతినిధి

» కరోనా టెస్టుల విషయంలో అభినందించాము అంటే... కరోనా కట్టడిలో ప్రభుత్వ పనితీరుని సమర్ధించినట్టు కాదు. కాటన్ దొరని పూజిస్తున్నాము అంటే... బ్రిటీషోళ్ల పాలనని ఆహ్వానిస్తున్నామని కాదు.

» 'అవిద్య, పేదరికం, అభద్రత'... ఈ మూడు లోపాలతో ప్రజలు రాజకీయాలలో భాగం కాలేకపోతున్నారు. విచిత్రమేమిటంటే... ఈ మూడు విషయాలను అడ్డం పెట్టుకునే రాజకీయ పార్టీలు ప్రజలకి మాయమాటలు చెప్పి మోసం చేస్తూ అధికారం కోసం పోటీ పడుతున్నాయి. కొన్ని పార్టీలు విజయం కూడా సాధిస్తున్నాయి.

» కోవిడ్ బారిన పడకుండా ఉండాలంటే... 'పొగ త్రాగరాదు, మద్యం సేవించరాదు, రోజూ వ్యాయామం చేయాలి' అని చెపుతున్న ప్రభుత్వాలే.. సిగరెట్లు అమ్ముకోనిస్తున్నాయి. మద్యం దుకాణాలు దగ్గరుండి తెరిపించాయి. వాకింగ్, చిన్నపాటి ఎక్సర్ సైజులు చేసుకునే పార్కులు మాత్రం మూసేసాయి.

విచిత్రంగా లేదూ...!!!

» వ్యాపార రంగంలో ధరల్ని సంస్థల యజమానులు నిర్ణయించుకున్నట్టే... తాము పండించిన పంటలకు న్యాయమైన ధరల్ని నిర్ణయించుకునే అధికారం రైతులకే ఇవ్వాలి. ఇలా 'విధానాల్ని సమూలంగా మార్చడం ద్వారా తప్ప' పాలకుల మొసలి కన్నీరు వల్ల రైతుల సంక్షోభం తీరదు.

### బాపట్ల నియోజకవర్గంలో 108 అంబులెన్సులు ఏమయ్యాయి ?




బాపట్ల ( జనస్వరం ) : బాపట్ల నియోజకవర్గంలో కరోనా బాధితులకు అంబులెన్సులు సరైన సమాయానికి అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం మేము ఇన్ని అంబులెన్సులు తెచ్చామని, పబ్లిసిటీ చేసిన దృష్టి వైద్యం విధానాల మీద పెట్టి ఉంటే బాగుండేదని అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో తూర్పు బాపట్ల మరియు కొండూబొట్లవారి పాలెం గ్రామంలో కరోనా బాధితులకు అంబులెన్సులు రాక వారిని ప్రైవేట్ ఆటోల్లో వాహనాల్లో తరలించిన దృశ్యం బాధాకరం. కరోనా వ్యాధిగ్రస్తులకు కనీస వసతులు కల్పించడంలో బాపట్ల నియోజకవర్గం ప్రభుత్వ అధికారులు మరియు ప్రజా ప్రతినిధుల వైఫల్యం మనకు కనిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని చర్యలు తీసుకోవాలని బాపట్ల నియోజవర్గ జనసైనికులు వెంకట శివన్నారాయణ, గుంటుపల్లి తులసి కుమారి, తదితరులు కోరారు.

### రోడ్డు సమస్యను పరిష్కారించాలని జగ్గయ్యపేట జనసైనికుల వినతి.

( మొదటి పేజీ తరువాయి )

చేసిన కార్యక్రమంలో జనసేన పార్టీ తరుపున ఆ రోడ్ మార్గాన్ని సందర్శించి, స్థానిక మండల డెవలప్మెంట్ ఆఫీసర్ వారికి వినతిపత్రం అందివ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఏంతోమంది ప్రజలు, రైతులు, విద్యార్థులు వారి వారి అవసరాలకి ఈ మార్గం గుండానే పెనుగంచిప్రోలు వస్తూ ఉంటారు అని మరీ దారి పొడుగునా రోడ్ మార్గం గుండా చాలా గుంటలు రోడ్ బాగా కిందకి కూరుకునిపోయి ఉండడంతో వారు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. అని ప్రస్తుత వర్షా కాలంలో వర్షాలు ఎక్కువగా పడుతుండడంతో వర్షపు నీరు రోడ్ మీద ఆగి ఉండడంతో ప్రజలు అదే విధంగా ఆ నీరు పంట పొలాల్లోకి వెళ్లటంతో రైతులు కూడా ఇబ్బందులకు గురి అవుతున్నారు అని ఆయన తెలిపారు. మరీ ముఖ్యంగా కృష్ణా జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా బెజవాడ కనక దుర్గమ్మ వారి తరువాత అంతటి ప్రాముఖ్యత చెందిన అమ్మవారు పెనుగంచిప్రోలు గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ వారు 2 సంవత్సరాలకి ఒకసారి రంగుల మహోత్సవాన్ని జగ్గయ్యపేట లో ముగించుకుని తిరిగి చిల్లకల్లు మీదుగా భీమవరం గ్రామం నుంచి ఈ రోడ్ మార్గం గుండా భక్తులు కాలినడకన అమ్మవారి పల్లకీలు మోస్తూ పెనుగంచిప్రోలు చేరుకుంటారు. అని అలాంటి సమయంలో భక్తులు కూడా చెప్పుకోలేని ఇబ్బందులు పడుతున్నారు అని ఆ రెండు రోజులు గలస కూడిన మట్టిని పోసి చేతులు దులుపుకుంటున్నారని, పూర్తి స్థాయిలో ఈ రోడ్ కి అభివృద్ధి అనేది జరగటం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగరాజు, చారి, నవీన్, మహేష్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

### జనసేన - బీజేపీ పార్టీలు సంయుక్తంగా ధర్నా

( మొదటి పేజీ తరువాయి )

చేత కొన్ని ఇళ్లకు కొంత డబ్బులు అని, మరి కొన్ని రకాల ఇళ్లకు ఇన్ని డబ్బులు అని డీడీ రూపంలో తీయించి ప్రభుత్వానికి డబ్బులు కట్టించుకున్నారు. చివరి నిమిషంలో ఎన్నికలు సంభవిస్తున్నాయి, ఎన్నికల కోడ్ ఉన్నందున ఇళ్ళులు మంజూరు చేయలేకపోతున్నామని చేతులు దులుపుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ద్వారా జరుగుతున్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అనేది కూడా ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద, కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇస్తుంటే దానిని కప్పిపుచ్చి ప్రతి పథకానికి జగన్నన్న జగన్నన్న పెట్టుకోటం జరుగుతుంది. ఏదైతే ఇళ్ల పట్టాల పంపిణీ అప్లికేషన్ ఉందో దాని మీద ఖచ్చితంగా పీఎంఏవై అని ముద్రించాలని ప్రభుత్వాన్ని ఇరు పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రజల పట్ల చిత్త శుద్ధి ఉంటే గత ప్రభుత్వంలో ఈ కార్యక్రమాన్ని అడ్డు పెట్టుకుని చేసిన అవినీతిని బయటపెట్టమని, పేద ప్రజల దగ్గర నొక్కినా ప్రతి రూపాయిని కక్కించండి అని లేదా మీరు కూడా ఇందులో భాగస్వాములుగా అవుతారని జనసేన - బిజెపి సంయుక్తంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేయడం జరిగింది.


### కావలి పేదల ఇళ్ల స్థలాల భూ కుంబకోణంపై జనసేన - బీజేపీ సంయుక్త ధర్నా

కావలి (జనస్వరం) : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గత ప్రభుత్వం పదివేల మంది కావలి పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి మొదటి విడత పూర్తయిన ఇళ్లను ఖాళీ గా ఉంచడమే కాకుండా మలివిడత ప్రారంభించాల్సిన 96ఎకరాల ఖాళీ పేదల ఇళ్ల స్థలాలకై కొత్తగా భూమిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఏం ఉందని, వైసీపీ ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేస్తుందని, రూ.10లక్షల విలువగల భూమినిరూ.20లక్షలకు రిజిస్ట్రేషన్ చేసి దాన్ని రూ.40 లక్షలకు రైతులకు ఇచ్చి దానిని రూ.55 లక్షలు గా ప్రభుత్వానికి బిల్లు పెట్టారని, దీనికి ససేమిరా ఒప్పుకోని కలెక్టర్ శేషగిరిబాబు ని బలవంతంగా బదిలీ చేశారని, ధనార్జనే పరమావధిగా వైసీపీ ప్రభుత్వ పాలన సాగుతోందని దానికి అధికార యంత్రాంగం ఎవరైనా తోడైతే వారు సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుందని అన్నారు.



జిల్లా వ్యాప్తంగా పేదలకు ఇంటి స్థలాల పేరుతో జరుగుతున్న భూ కుంభకోణంపై జనసేన పార్టీ మరియు భారతీయ జనతా పార్టీ సంయుక్తంగా పోరాటం చేస్తామని, జరిగిన అన్యాయానికి సంబంధించి పై స్థాయి కమిషన్ వేసి విచారించి బాధ్యులను శిక్షించాలని జనసేన పార్టీ మరియు జనతా పార్టీ తరపున పత్రికా ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ కార్యాలయం నుంచి మనుక్రాంత్ గారి తరపున గునుకుల కిషోర్,పశుపర్తి కిషోర్ బీజేపీ జేపీసీ సమన్వయకర్త శ్రీకాంత్, అనుదీప్, ప్రశాంత్ గౌడ్, సాయి, తోటశేషయ్య గారు,వెంకట శేషయ్య గారు, రుషికేష్, సుధీర్, బిజెపి తరపున జిల్లా ఇన్చార్జి భరత్ కుమార్, కందుకూరు సత్యం, బ్రహ్మానందం, పద్మావతి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

### కోవిడ్ -19, 1500 పడకల ఆసుపత్రి ఇదేనంటూ ప్రజల్ని మభ్యపెడుతున్న అధికార పార్టీ నాయకులు, అధికారులు



ఏపీలో 1,500 పడకలతో కోవిడ్ కేర్ సెంటర్

HAL sets up 160-bed Covid Care Centre in 16 days

The 160-bed Covid Care Centre set up by the Hindustan Aeronautics Limited at its Ghatage Convention Centre located on Old Airport Road in Bengaluru.

న్యూస్ (జనస్వరం) : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోవిడ్ -19 కు సంబంధించి 1500 పడకల ఆసుపత్రిని నిర్మించబోతోంది. అయితే పూర్తిగా రెడీ అయిందంటూ దాని తాలూకా ఫోటోలను అధికార పార్టీ నాయకులు మరియు అధికారులు సోషియల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అయితే ఆ ఫోటోలు కర్ణాటక ప్రభుత్వం కోవిడ్-19 కు సంబంధించి 160 పడకల ఆసుపత్రి ఫోటోలు చూపించి ప్రజల్ని మభ్యపెడుతున్నారని సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నారు. ఇలా ఇంకా ఎంత కాలం మభ్యపెడతారని విమర్శిస్తున్నారు.

### పాత్రికేయులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి - పందిటి మల్హోత్రా

మైదుకూరు (జనస్వరం ): ఈ కరోనా విపత్కర కాలంలో ఫ్రంట్ వారియర్ గా పాత్రికేయులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని మైదుకూరు జనసేన పార్టీ ఇంచార్జ్ పందిటి మల్హోత్రా గారు అన్నారు. అనునిత్యం వార్తా సమాచారాన్ని మన ముంగిటకు తెచ్చే పాత్రికేయులకు కరోనా కిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ జిల్లాలో ఇద్దరు పాత్రికేయులు కరోనా సోకి మృతి చెందడం బాధాకరం అన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వార్తలను అందించే పాత్రికేయులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు.

### పలుమార్లు సమస్యలు విన్నవించినా పట్టించుకోని అధికారులు

( మొదటి పేజీ తరువాయి)

ఆశ్రయించామన్నారు. ఈ గ్రామానికి అంబులెన్సులు రావాలన్నా కూడా చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందన్నారు. చుట్టుగుండం గ్రామంలో కూడా తాగడానికి సరైన నీటి వసతి లేదని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ వర్షాకాలంలో గ్రామం అంతా నీటితో నిండిపోయే పరిస్థితి అని అన్నారు. గ్రామంలో వీధి లైట్లు లేకపోవడం వలన చీకటిలో బ్రతకాల్సి వస్తోందని, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గారికి స్పందన కార్యక్రమం ద్వారా తెలియజేశామన్నారు.

### ఓ మగువా నీకు రక్షణ ఎక్కడ ?

( మొదటి పేజీ తరువాయి )

రాజమహేంద్ర వరంలో కుటుంబ పోషణ కోసం ఒక దుకాణంలో పని చేస్తున్న 16 ఏళ్ల బాలికపై కొందరు బాలికలు అత్యాచారం చేయడం బాధాకరం. బాధితురాల తల్లి వెళ్ళి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సరైన స్పందన కరువైందని ఆ తల్లి బాధపడటం చూశాం. అలాగే ఈ మధ్య చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం గూడూరుపల్లి గ్రామంలో గ్రామ వాలంటీర్ ఒక మైనర్ దళిత బాలిక మీద అత్యాచారానికి ఒడిగట్టడం, ఈ అత్యాచారం కేసు బయటకి రాకుండా వైయస్సార్ పార్టీ నాయకులు ఒత్తిడి చేయటం చూస్తున్నాం. ఇంకా నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం పెదరాజుపాలెంలో 9 ఏళ్ల బాలికపై గ్రామ వాలంటీర్ అత్యాచారం చేయడం ఆ కేసును ప్రక్కదోవ పట్టించేందుకు అధికార పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇలా నెలకు పదుల సంఖ్యలో అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం నుంచి సరైనా స్పందన లేకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిర్భయ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన దిశ చట్టాలు కేవలం రాజ్యాంగంలో చట్టాలుగా ఉన్నాయి కానీ, ఆడపిల్లకు ఆ చట్టాలు ఏమాత్రం కూడా రక్షణ ఇవ్వలేకపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని కామాంధుల మీద తగు చర్యలు తీసుకొని, చట్టాలను మరింత బలంగా చేయాల్సిన అవసరం ఉంది.

జనస్వరం
అక్షరమే ఆయుధం ✍
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైనవాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl